ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 12.03.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్ లో నెట్ ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.
2. ప్రధానిమంత్రి మోదీ నాయకత్వంలో భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, దేశ ప్రయోజనాలను, విదేశాల్లోని భారతీయుల భద్రతకు పెద్ద పీట వేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.
3. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.
4. ప్రపంచకప్ హాకీ టోర్నీలో పూల్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 4–1 గోల్స్ తేడాతో వేల్స్ జట్టుపై ఘనవిజయం సాధించి... సెమి ఫైనల్ కు దూసుకెళ్లింది.

----------------------------

**NETFLIX**

హైదరాబాద్ లో ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్ కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. హెచ్ఐసీసీ లోజరిగిన ఈ కార్యక్రమానికి ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, సినీ నటుడు రానా దగ్గుబాటి, నెట్ ఫ్లిక్స్ ఐల్యాండ్ సీఈఓ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..... నెట్ ఫిక్స్ కెంపెనీ హైదరాబాద్ లో కార్యాలయం

ప్రారంభించడంతో హాలీవుడ్ కు చెందిన ఇతర సినీమా ప్రొడక్షన్ హౌస్ లు హైదరాబాద్ లో తమ కార్యకలాపాలు ప్రారంభిస్తాయని ఆశించారు.

**బైట్ – ముఖ్యమంత్రి**

సంజయ్ జాజు మాట్లాడుతూ....హైదరాబాద్‌ను దక్షిణ భారత్ లో 'AVGC సూపర్ హబ్'గా మార్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు

**బైట్ - సంజయ్ జాజు**

**డెస్క్**

---------------------

**కిషన్ రెడ్డి**

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతూ కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో అవినీతి, అధిక ధరల వల్ల భారత్ 'Fragile-5' దేశాల జాబితాలోకి వెళ్లిపోయిందని, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు రాత్రి వేళల్లో పెట్రోల్ బంకులను మూసివేయాలని నాటి ప్రభుత్వం ప్రయత్నించిందని గుర్తు చేశారు. అప్పట్లో సాధారణ పరిస్థితుల్లోనే ప్రభుత్వం తడబడిందని, ఒకవేళ అప్పుడే ఇలాంటి యుద్ధ వాతావరణం ఉండి ఉంటే దేశ పరిస్థితి ఊహించుకోవడానికే భయమేస్తుందని ఆయన విమర్శించారు.

నేడు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్న, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ దేశ ప్రయోజనాలను కాపాడుకుంటోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. విదేశాల్లో ఉన్న ప్రతి భారతీయుడి భద్రతకు భంగం కలగకుండా కేంద్రం అండగా నిలుస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఒకప్పటి బలహీనమైన ఆర్థిక వ్యవస్థ నుంచి భారత్ నేడు దృఢమైన శక్తిగా ఎదిగిందని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి  కొనియాడారు.

**డెస్క్**

----------------------

**సుప్రీంకోర్టులో విచారణ**

బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో నేడు సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసిహ్ ధర్మాసనం ఈ అంశాన్ని పరిశీలించనున్నారు. గత విచారణలో స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కోర్టు హెచ్చరించిన క్రమంలో, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి పార్టీ మారలేదని స్పీకర్ నిన్ననే తన నిర్ణయాన్ని ప్రకటించారు. అయితే ఈ నిర్ణయంపై బీఆర్ఎస్, బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. దానం నాగేందర్ కాంగ్రెస్ తరఫున లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసిన సాక్ష్యాలు ఉన్నప్పటికీ, స్పీకర్ వాటిని విస్మరించారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

**డెస్క్**

------------------------------

**పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈరోజు ఖమ్మం లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అనే అంశంపై నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అధికారులు ప్రజా ప్రతినిధులు సద్వినియోగం చేసుకొని ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి జరిగే విధంగా పాటుపడాలని సూచించారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న, కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి పేదవాళ్ళకి తెలియజేసి ఆ పథకాలు లబ్ధిదారులకు చేరువ అయ్యే విధంగా చేయాలన్నారు.

**బైట్ - పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**పీటీసీ - ఖమ్మం**

--------------------------

**మంత్రి వాకిటి శ్రీహరి**

పేదల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు... నారాయణపేట మక్తల్ మండల కేంద్రంలో 120 మంది లబ్ధిదారులకు ఒక కోటి 20 లక్ష రూపాయల కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు పరుస్తున్నామన్నారు.

**బైట్ - మంత్రి వాకిటి శ్రీహరి**

**పీటీసీ – మహబూబ్ నగర్**

----------------------

**కావూరి సాంబశివరావు**

కేంద్ర మాజీ మంత్రి, ప్రముఖ పారిశ్రామికవేత్త కావూరు సాంబశివరావు మృతి పట్ల రాజకీయ, సినీ, వ్యాపార రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో ఉంచిన పార్థివదేహానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారకరామా రావు, తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రాంచందర్‌రావు, ఏపీ బీజేపీ అధ్యక్షులు మాధవ్, ఏపీ రాష్ట్ర ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, యరపతినేని శ్రీనివాసరావుతో పాటు ప్రముఖ నటుడు మురళీమోహన్ నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.సాంబశివరావు మరణం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు, పారిశ్రామిక రంగానికి తీరని లోటని ఈ సందర్భంగా ప్రముఖులు అన్నారు.

**డెస్క్**

--------------------------

**అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్**

అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్-ABSS విస్తరణ కింద కామారెడ్డి పట్టణ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన దిల్లీలో కేంద్ర

మంత్రిని కలిసి పట్టణంలోని ఓరియంటల్ పాఠశాల నుంచి దర్శన్ థియేటర్ వరకు అభివృద్ధి చేయాలని వినతి పత్రం అందజేశారు.

**పీటీసీ - కామారెడ్డి**

----------------------

**ప్రతిమ ఫౌండేషన్**

నెలసరి ఆడపిల్లలకు దేవుడు ఇచ్చిన వరమని ప్రతిమ ఫౌండేషన్ ఫౌండర్ డా.బోయిన్పల్లి హరిని తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కుమార్వాడి పాఠశాల, కోతి రాంపూర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రతిమ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సానిటరీ పాడ్స్ డిస్పోజల్ మిషన్ ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రతిమ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ బోయినపల్లి హరిణి మాట్లాడుతూ .....

**బైట్ -డా. బోయినపల్లి హరిణి**

**పీటీసీ - కరీంనగర్**

------------------------

**హాకీ ప్రపంచకప్**

ప్రపంచకప్ హాకీ టోర్నీలో నిన్న జరిగిన లీగ్ మ్యాచ్ లో భారత మహిళల జట్టు అద్భుత విజయాన్ని అందుకుంది. గచ్చిబౌలి స్టేడియంలో పూల్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో సలీమా టెటె నాయకత్వంలోని భారత్ 4–1 గోల్స్ తేడాతో వేల్స్ జట్టుపై ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత స్టార్ ప్లేయర్ నవ్‌నీత్ కౌర్ 29, 34, 55 నిమిషాల్లో హ్యాట్రిక్ గోల్స్ తో సాధించి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డును కైవసం చేసుకుంది. మరో గోల్‌ను సాక్షి రాణా అందించగా, వేల్స్ తరఫున బెట్సాన్ థామస్ ఏకైక గోల్ సాధించింది.

భారత జట్టుకు లభించిన తొమ్మిది పెనాల్టీ కార్నర్‌లలో రెండింటిని, అలాగే ఒక పెనాల్టీ స్ట్రోక్‌ను నవ్‌నీత్ కౌర్ సమర్ధవంతంగా గోల్స్‌గా మలిచింది. ఈ గెలుపుతో భారత జట్టు ఏడు పాయింట్లతో పూల్ 'బి' టాపర్‌గా నిలిచి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది.

**డెస్క్**

---------------------

**మొబిలైజేషన్ శిక్షణ**

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీసులు తమ వృత్తి నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని, ఇందుకు మొబిలైజేషన్ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ గీతే పేర్కొన్నారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

----------------------

**కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత ఇవాళ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ క్రీడా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి... వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

---------------------

**నీరా కేఫ్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నీరా కేఫ్ నిర్వహణ కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సౌజన్య ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు.

**పీటీసీ - రాజన్న సిరిసిల్ల**

------------------------